


ఒకటవ తారీకు వస్తుందంటే ఆనందించేవాళ్ళకంటే భయపడేవారే ఎక్కువేమో ప్రస్తుత పరిస్థితుల్నిబట్టి. చాలీ చాలనీ జీతాలు. సంతృప్తి అంటూ ఉండదు. ప్రతీ నెలా వెరితే. ధరలకు ఫుల్‌స్టాప్ అంటూ లేదు. ఇక ఒకటి తప్పితే ఒకటి ఖర్చులు అనుకున్నవాటికంటె అనుకోనివి ఎక్కువ. అందులోను ఈ పట్నాలో ఉంటే బంధువులు, స్నేహితులు పని కట్టుకు మరీ వస్తారు. ఈ యిబ్బందులన్నీ మధ్య కుటుంబీకులకే. వీరు క్రిందికి దిగాలేరు. మీదికి వెళ్లే తాహతూ లేదు. ఎన్ని రకాల ప్రణాళికలు వేసినా ఈ లోటు మాత్రం తీరలేదు. తీరే టట్టు కన్పట్టంలేదు. ఏదో ఆశ మాత్రం లీలగా కన్పడుతోంది.

ఇంట్లో చూస్తే అందరం ఒక్కలాగే ఉన్నాం. ఏ ఒక్కరికీ ఆనందం అంటే ఏమిటోలా ఉంటుంది. కష్టాలకే అలవాటు పడ్డాం. కాబట్టి సరిపోతుంది. కష్టాల్ని కమ్మగా ఆహ్వానించగల శక్తి కూడా ఉంది. ఒక్క జీతం, అదీ ఎవ్వరికని యియ్యడం. పాలకు యియ్యకపోతే ఆమె వూరుకోదు. షావుకారుకు యియ్యకపోతే మళ్ళా సరుకు లీయడు. అద్దె యివ్వకపోతే యిల్లు ఖాళీ చేయాలి. ఇవే ప్రశ్నలతో కొట్లాడుతున్నాడు మన వీర్రాజు. "సాయంకాలానికి బియ్యం లేవురా నాయనా" యింట్లోనుండి అమ్మ కేక. గబగబా బట్టలు వేసుకుని తాలూకాఫీసుకు బయలుదేరాడు. అరబస్తా బియ్యం పర్మిటు కోసరం. వెళ్ళి చూస్తే అది తాలూకాఫీసా .... లేకపోతే ఏదైనా సంత జరుగుతుందా. అయినా ఈ రోజుల్లో. ఆశ్చర్యపోనవసరంలేదు. తాసీల్దారుగారు మంచి గిరాకీలో ఉన్నారు. అందులోనూ ప్రమోషన మీద వస్తే వేరే చెప్పాలా? అసలు ఈ రోజుల్లో తాలూకాఫీసులో వాళ్ళందరికీ గిరాకీయే. ఒకరిమీద ఒకరు కొత్తగా వచ్చిన సినిమా టికెట్లు కోసం పడుతున్నట్లు పడుతున్నారు.

వీర్రాజు ఒక్కసారిగా లోపల్కి చొర పడ్డాడు. అభిమన్యుడు పద్మవ్యూహంలోనికి పోయినట్లుగా. ఓహో ......తాసీల్దారుగారు సిగరెట్టు కాల్చుకుంటూ గుమాస్తాగార్కి ఆర్డర్లు జారీచేస్తున్నారు. చుట్టూ పెద్ద వాళ్ళంతా ఉన్నారు. డాక్టరుగారు, మాజీ ఎం. ఎల్. ఎ. గారు, శాస్త్రులుగారూ వగైరా వగైరా ....ఇక వీర్రాజుకు ఆశ లేదు ఈరోజు. అయినా తనకురిక్కనే ఆయుధం ఉందిగా. ప్రయోగించి చూద్దాం అనుకున్నాడు మనస్సులో "బియ్యంలేవు. గోధుమలు గాని పంచదార గాని తీసుకెళ్ళండి" హెడ్గుమాస్తాగారి కంఠం ఘోషిస్తోంది. వీర్రాజుకో ఆలోచన తట్టింది. అంతా పోయేదాకా ఉంటే రిక్కు చూపించి ఏదోలా బతిమాలుకుందాం. కనీసం పావయినా యిస్తే రోజు లీడ్చేయవచ్చు. అనుకొని ప్రక్క కాఫీ హొటల్లో పడ్డాడు.

హొటల్లో కూడా కాఫీ డబ్బులు మిగిలాయి. మిత్రులు సూరిగాడూ, రావు గార్లూ కలసి పలకరించారు. తన బిలు కూడా వాళ్ల బిల్లుతో కలిపి యిచ్చే

సాడు. అప్పుడప్పుడు పాదరసంలా పని చేస్తుంది లెండి వీర్రాజు బుర్ర. ముగ్గురూ కలసి ఆఫీసువేపు వస్తున్నారు. ఒక్కసారిగా వీర్రాజు గుండె ఆగిపోయినట్లయింది. గేటు దగ్గర భూమ్మీద... కళ్ళు తడబడ్తున్నాయి. నోట్లలా కన్పడుతున్నాయి. తియ్యాలా .... మానాలా చుట్టూ చూసాడు. అంతా ఒక్క క్షణములో జరిగిపోయింది. ఒక్క రిక్షావాడు తప్ప మరెవ్వరూ చూడలేదు. చూసి గూడా వూరుకున్నాడు సందేహంగా. పాపం వాడికేం తెల్సు అవి వీర్రాజువి కావని. ఒళ్ళంతా చమట పట్టేసింది. "ఒరే లెక్కపెట్రా రాజూ" వాళ్ళిద్దరూ. "ఉండండ్రా ముఖం తుడుచుకోనీయండి" అంటూ తన రుమాలుతో ముఖం కళ్ళూ తుడ్చుకున్నాడు గట్టిగా. లెక్కపెడ్తుంటే చేతులు వణుకుతున్నాయి. కళ్ళు తడబడుతున్నాయి. ఒక్కొక్క నోటూ నాలుగేసిలా కన్పడుతున్నాయి. రెండు పదులు, రెండయిదులు,అయిదు రెళ్ళూ అయిదు ఒకట్లూ... మొత్తం చూస్తే 45 రూపాయలు... హమ్మయ్య .... యిప్పుడేం చేయడం..' ఎవరయినా వెతుక్కుంటున్నారేమో. చుట్టూ చూసాడు అమాయకపు వీర్రాజు. ఎక్కడా ఆ జాడే లేదు. ఎవరో దురదృష్టవంతులు. పాపం అరబస్తా బియ్యం డబ్బులు. తనలాగే నెలంతా ఎంత బాధపడ్తాడో. బియ్యం కోసం యెదురుచూస్తున్న భార్యా బిడ్డలకు యేం చెపుతాడో. ఎక్కడ వెతుక్కుంటున్నాడో ఏమో. నెలంతా కష్టపడి సంపాదించిన డబ్బులు. ప్రొద్దున్నే ఎవరి మొహం చూసాడో. పోనీ యెవ్వరికైనా చెప్పేస్తే .... ప్రతీవాడూ నావే నంటారేమో. వో చిన్న పని చేద్దాం అనిపించింది.—వెర్రి వీర్రాజుకి. ఈ నోట్లు తీసి బయట అందర్కీ కనపడేటట్లు పట్టుకుంటే ఎవరైనా వస్తారేమో అనుకుని మాటిమాటికి లెక్కపెట్టడం మొదలు పెట్టాడు. అబ్బె యెవ్వరూ రావడం లేందే. వా డెవడో డబ్బులు మహా స్టయిలుగా లెక్కపెడ్తున్నాడు. ఈ టౌను సంగతి యింకా తెలీదు గాబోలు అన్నట్లు చూస్తున్నాడో మాటుదారు.

"ఏం బాబూ డబ్బులు ఏమాత్రం దొరికాయి" ఎవడ్రా వీడని చూస్తే యిందాకటి రిక్షావాడే. "నావేనా.... వ .... పడిపోతే మరల తీసుకున్నాను. అయినా ఈ రోజుల్లో డబ్బులు పారేసుకున్నవా డెవడ్రా నీ వెర్రి గాని" అన్నాడే గాని ఆ రిక్షావాడు నమ్మినట్లు లేదు. పోనీ పోలీసు స్టేషనులో చెప్పేద్దాం. అమ్మో బాబోయ్. రోజూ డబ్బు ఖర్చులు పెట్టించేస్తారు. అక్కడేదో జనం మూగినట్లున్నారు. డబ్బు పారేసుకున్నవాళ్ళేమో. బయలుదేరాడు. 'ఏమిటండీ. ఏం జరిగింది ? "ఆఁ.... ఏం లేదండీ. అతనెవరో స్టూడెంటుట. కాలేజీకి హాస్టల్‌కు డబ్బు కడ్తానని తెచ్చి సానింట్లో కెళ్తున్నాడట. వాళ్ళ వాళ్ళు నాలుగు తన్ని తీసుకుపోతున్నారు. అంతే ...." హమ్మయ్య, రక్షించావురా.... భగవంతుడా !

వో పెద్ద సందేహం పట్టుకుంది. మన వీర్రాజుకి. ఇప్పుడేం చేయాలీ డబ్బులు. పూర్తిగా బియ్యం బస్తా కొనేసుకుంటే... యిన్ని డబ్బు లెక్కడివిరా అని అమ్మడిగితే, దొరికాయంటే ఎవరయినా నమ్ముతారా? వో జత బట్టలు కుట్టించుకుంటే. డబ్బులు చాలడంలే దన్నాడు. బట్టలు ఎట్లా కుట్టించుకున్నాడ్రా అంటే. ప్చ్. ప్చ్. ఉదో కను పార్టీ యిచ్చేస్తే. అది కూడా నమ్ముతారా. పోనీ యేదైనా మంచి విలువైన వస్తువు కొనుక్కుంటే దాని పేరు మీదుగా ఉండిపోతుంది. ఉహూ ....అదీ లాభంలేదు. చిన్నప్పట్నించీ సినిమా అంటే చాలా సరదా. ఎన్నాళ్ళయిందో సినిమా చూసి. వీళ్ళిద్దర్నీ తీసుకుపోదాం అని లక్షన్నర ఆలోచనలు చేసి, తన యీ అమూల్యమైన మెదడుని చిత్రవధ చేసి తన మిత్రులిద్దర్నీ సలహా అడగాలని నిశ్చయించుకున్నాడు మన వీర్రాజు.

'ఏంచేద్దాంరా సూరీ." "ఒరే రాజూ! నన్నడిగితే ముగ్గుర్కీ సమానంగా పంచ్రాలా."

"అయితే యిందాకటి రిక్షావాడో మరి"

"వాడూ సెందుకురా. వా డెప్పుడో పోయాడు."

"బాగుంది గాని నాకా చిన్న భయం వస్తుందిరా."

"ఏమిట్రా నీ భయాలు సందేహాల్నా నువ్వూను."

"ఏంలేదురా. అన్యాయంగా వచ్చింది మరల ఎప్పుడైనా అలాగే పోతుందంటార్రా మన పెద్దలు. అంచేత దేవుడు డబ్బిలో పడేస్తే పాపం పారేసుకున్నవాడి ఆత్మకు శాంతి కల్గిస్తాడేమో దేవుడు"

"ఛ.... ఛ .... ఛ .... వెధవ తెలివి తక్కువ నువ్వూను. అసలు నీకు ఈ వీర్రాజని పేరెవరు పెట్టార్రా. పిరికి వెధవా, నీంత భయం అయితే నా కిచ్చేయిరా, నేను ఖర్చుపెడతాను."

'వద్దురా. నే నివ్వను. మా యింటికి పోయి ఆలోచిద్దాంరా."

* * *

"బాబూ మీకాళ్ళట్టుకుంటాను బాబూ! వారం రోజుల్నుండి అన్నం తిని యెరగం బాబూ. బియ్యం దొరకడంలేదని మా అమ్మ నాగుజోడు తాకెట్టెట్టాను బాబూ. ఇప్పుడే గంటయింది బాబూ. కావాలంటే సెట్టిగారింటికి రండి బాబూ బుజువిప్పిస్తాను. ఇక్కడ బియ్యం దొరుకుతాయని వచ్చాను బాబు. దొమ్మిగా ఉందని స్టేషన్కొపోయాను. టిక్కెట్టుకు డబ్బులు తీదామని మొలంతా తడిమినా డబ్బుల్లేవు బాబూ. మీరు పోలీసోల్లు. ఎలాగైనా డబ్బులు వెతికిప్పించండి బాబూ. లేకపోతే యిక్కడ్నే నా ప్రాణాలు పోతాయినాయ్నా. ముసలిదాన్ని కోపగించకండి తండ్రీ. ఇనస్పెట్టు బాబూ. నీ తల్లిలాంటిదాన్ని. రక్షించండి తండ్రీ." ప్రక్కనున్న పోలీసు స్టేషను దగ్గర ఎవరో ముసలమ్మ పల్లెటూరునుండి వచ్చినట్లుంది. లబోదిబోమని యేడుస్తుంది. ఎన్నాళ్ళనుండో దుమ్ముపట్టిపోయిన వీర్రాజు యీ యేడ్పు వినటంతో చెవులు దుమ్మంతా యెగిరిపోయింది గబగబా పరుగెత్తాడు. ఆ అవ్వ ఇనస్పెక్టరుగారి కాళ్ళ దగ్గర పడి ఒకేలాగ ఏడుస్తుంది. వీర్రాజు తా నూహించుకున్నదంతా ఏమయిపోయిందో ....

"అవ్వా నీ డబ్బులన్నీ చెప్పగలవా."

"చెప్పగలను తండ్రీ."

"మొత్తం ఎన్ని రూపాయలు."

"నలభై అయిదు రూపాయిలు బాబూ"

"ఇంకా చిల్లరేమైనా ఉందా."

"మరేలేందు నాయనా. అప్పు కాయి తాలే."

"ఇనస్పెక్టరుగారూ. ఇదిగో డబ్బులు గేటు దగ్గర దొరికాయి." అని ధైర్యంగా యిచ్చేసాడు వీర్రాజు. అతని యెదుటే లెక్కపెట్టి అతని చేతిమీదుగానే యిప్పించే

## పాపం వీర్రాజు

సారు యిన్‌స్పెక్టరుగారు.


"నీ పేరేమిటి నాయనా. మళ్లా జన్మలో కొడుకు పుడితే నీ పేరు పెట్టుకుంటాను."

"నా పేరు వద్దవ్వా. జాగ్రత్తగా కట్టుకుని యింటికి వెళ్లిపో. వస్తానం డీ ఇనస్పెక్టరుగారూ. బియ్యం పర్మిటు తీస్కోవాలి. పదండర్రా పోదాం....." అని యిటు తిరిగాడు వెర్రి వీర్రాజు. మిత్రులేరీ ?

'తాలూకాఫీసు కట్టేసారండీ.'

దూరంనుండి వో కంఠం. ●




ఎక్కడ
లైఫ్‌బాయ్ వున్నదో
అక్కడ ఆరోగ్యము వున్నది

లైఫ్‌బాయ్ తో స్నానము మీకు అత్యంత ఆరోగ్యవంతమైన హాయి గొలుపుతుంది. లైఫ్‌బాయ్‌లో ఉత్తమమైన సబ్బులో వుండ వలసిన అన్ని సుగుణములే గాక ఇంకా ఎన్నియో వున్నవని మీరు తెలిసికొందురు.

లైఫ్‌బాయ్ మురికిలో గల క్రిములను కడిగి వేస్తుంది

హిందుస్థాన్ లీవర్ ఉత్పత్తి

లింటాస్-L 49.140 TE)